సాక్షి
కుమురం భీం

బుధవారం । 4 । జనవరి । 2023



'కెరీర్ అవేర్‌నెస్'పై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం కెరీర్ అవేర్‌నెస్ అనే అంశంపై కెరీర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి బాలు అవగాహన కల్పించారు.

తల్లుల చెంతకు శిశువులు



మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో చిన్నారుల తారుమారయ్యారనే ఘటనలో ఉత్కంఠకు తెరపడింది. డీఎన్‌ఏ పరీక్ష ఫలితాల ద్వారా శిశువులను తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

10లో▸

గరిష్టం/కనిష్టం
29.5 /17.5

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం కొంతమేరకు మేఘావృతమౌతుంది. గాలిలో తేమ పెరుగుతుంది. చలి ప్రభావం చాలా వరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నేడు కాగజ్‌నగర్‌లో డివిజన్ స్థాయి సైన్స్‌ఫేర్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం డివిజనల్ స్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్నట్లు డివిజన్ స్థాయి సైన్స్‌ఫేర్ నోడల్ అధికారి ఖమర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్పతోపాటు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ మణెమ్మ, జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, ఏసీఎంవో పుర్క ఉద్దవ్, ఎంఈవో భిక్షపతి అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. 82 అంశాలపై ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. కాగజ్‌నగర్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, సైన్స్ ఔత్సాహికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గుణాత్మక విద్యనందించాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం మేళాలో ప్రదర్శించిన టీఎల్ఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు టీఎల్ఎంతో బోధించేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు పాఠాలు ఎక్కువ రోజులు గుర్తుండే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, ఎంఈవో మసుక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమన్న జాతరకు రండి!




పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవో వరుణ్‌రెడ్డి

తిర్యాణి(ఆసిఫాబాద్): తిర్యాణి మండలం దంతన్‌పల్లి గ్రామంలో ఈ నెల 19 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే భీమన్న జాతరకు రావాలని నిర్వహణ కమిటీ సభ్యులు మంగళవారం ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, చైర్మన్ కనక లక్కెరావ్‌ను వేర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రికలు అందించి ఆహ్వానించారు. వారితో కలిసి జాతర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటీ సభ్యులు ఆత్రం గంగరాం తదితరులు ఉన్నారు.

ఎంసెట్ ఉచిత శిక్షణకు సన్నద్ధం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఉచిత ఎంసెట్ శిక్షణ కోసం సన్నద్ధం చేయాలని డీఐఈవో శ్రీధర్‌సుమన్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 6 నుంచి ప్రీఫైనల్ ఎగ్జామ్స్, 15 నుంచి ప్రాక్టికల్ ఉంటాయని పేర్కొన్నారు. ఆ లోగా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఉచిత ఎంసెట్ శిక్షణకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఆదేశించారు. మొదట జిల్లా స్థాయి స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని, ప్రతిభ కనబర్చిన వారికి ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

'ఫైలేరియా' నియంత్రణే లక్ష్యం



బాధితులకు వివరిస్తున్న వైద్యసిబ్బంది

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో ఫైలేరియా వ్యాధిని నియంత్రించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంఎండీపీ కిట్లు పంపిణీ చేస్తోందని డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండపల్లిలో బోదకాల వ్యాధితో బాధపడుతున్న 26 మందికి మంగళవారం ఎంఎండీపీ కిట్లు అందించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో 950 మంది ఫైలేరియా బాధితులు ఉండగా, రెబ్బెన మండలంలో 78 మంది ఉన్నారని తెలిపారు. బాధితులు సెకండరీ ఇన్‌ఫెక్షన్ సోకకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ప్రోగ్రాం అధికారి సంతోష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్టు సందీప్ పాల్గొన్నారు.

కంకర కోసం వంకర దారులు !



వాంకిడి మండలం డొంగ్రగావ్ క్వారీలో బండరాయిని తవ్వుతున్న యంత్రాలు

ఓ కంపెనీ నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణానికి భారీ మొత్తంలో కంకర అవసరమైంది. చుట్టుపక్కల వెతికింది. అందుబాటులో ఉన్న గుట్టలపై కన్నేసింది. అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో స్థానిక గిరిజనుడి పేరుతో లీజుకు తీసుకుని కావాల్సిన కంకరను 'అధికారికంగా'నే తవ్వుకుంటోంది. ఇప్పుడున్న చట్టాలు, నిబంధనల ప్రకారం బండరాయి క్వారీ అనుమతులు పొందడం సులువైంది కాదు. కానీ దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లో నే పర్మిషన్లు వచ్చాయంటే ఇందు కోసం అన్ని శాఖల యంత్రాంగం తమ వంతుగా త్వరితగతిన అనుమతులు ఇచ్చేసి, సహజ వనరులను బడా కాంట్రాక్టరుకు అప్పగించేశారు.

- జాతీయ రహదారి నిర్మాణం కోసం కంకర క్వారీ
- వాంకిడి మండలం డొంగ్రగావ్‌లో అనుమతులు
- గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతున్నా పట్టింపు కరువు
- బడా కాంట్రాక్టరు కోసం అన్ని శాఖల సాయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/వాంకిడి: మంచిర్యాల నుంచి కుమురంభీం జిల్లా వాంకిడి మండలం గోయగాం వరకు నిర్మిస్తున్న నాలుగు వరసల జాతీయ రహదారి–363 నిర్మాణంలో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన కంకర కోసం వాంకిడి మండలం సవితి గ్రామ పంచాయతీ పరిధి డొంగ్రగావ్‌లో క్వారీ, దొడ్డిగూడలో కంకర క్రషర్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సర్వే నంబరు 19/1/1 బీడీపీపీ భూమిలో 4.880 హెక్టార్ల(12ఎకరాలు)లో ఉన్న బండరాయిని తొలిచి, కంకరగా మార్చి అమ్ముకునేందుకు దరఖాస్తులు వచ్చాయి. నెల రోజుల్లో 20ఏళ్ల కోసం సిర్పూర్(యూ) మండలం పంగిడికి చెందిన దుర్రె అరుణ్‌కుమార్ పేరుతో 2.330 హెక్టార్ల(5.7ఎకరాలు)కు అనుమతులు ఇస్తూ పర్యావరణ శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. మొదట అటవీ భూమినే అనుమతులు కోరారు. తర్వాత మార్చి దరఖాస్తు చేశారు. అంతకుముందు ఆసిఫాబాద్, వాంకిడి మండలాల తహసీల్దార్లు ఇచ్చిన 'నో ఆబ్జక్షన్' సర్టిఫికేట్ ఇస్తే, గనుల శాఖ ఓకే చెప్పింది. ఇంకేముంది కొద్ది రోజులుగా ట్రక్కుల్లో కంకర తరలిపోతోంది. ఒక హెక్టారుకు ఏడాదికి రూ.లక్ష చొప్పున లీజుకు, ఒక మెట్రిక్ టన్ను కంకర తరలింపు కోసం సీనరేజీ చార్జీలు రూ.65, అనుమతి ఫీజు రూ.52, డీఎంఎఫ్‌టీ తదితర చార్జీలు చెల్లించాకే ఆన్‌లైన్‌లోనే రాష్ట్ర స్థాయి నుంచి అనుమతులు వచ్చాయి. ఇటీవల క్వారీల లీజుల నిబంధనలు కఠినతరం చేయడంతో కొత్త క్వారీలు అంత సులభంగా రావడం లేదు. అయితే ఇక్కడ మాత్రం దరఖాస్తు చేసుకున్న కొద్ది రోజులకే అటవీ శాఖ, రెవెన్యూ, గనులు, పర్యావరణ శాఖల ఆమోదం పొందడం గమనార్హం.

గుండి క్వారీ తిరస్కరించడంతో..



దొడ్డిగూడలో కంకర మిషన్

మొదట రోడ్డు పనులకు కంకరం కోసం మొదట ఆసిఫాబాద్ మండలం గుండి సమీపంలో ఓ క్వారీని ఎంపిక చేసుకున్నారు. అధికారులు తిరస్కరించడంతో దొడ్డిగూడలో క్వారీని ఓ ఆదివాసీ పేరుతో తీసుకుని లీజుకు తీసుకుని, నిర్మాణ కంపెనీ భారీగా కంకరను తరలిస్తోంది. 20ఏళ్లపాటు లీజు ఉండడంతో అక్కడ ఉన్న బండరాయిని ఎంత దోచుకుంటారోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో పెసా చట్టం ప్రకారం స్థానిక గ్రామ పంచాయతీ అనుమతి తప్పనిసరి కావడంతో గ్రామస్తులకు రోడ్డు ఆశ చూపి తీర్మానం రాయించుకున్నారు.

ఆదివాసీల పొట్టకొట్టారు



మడావి భీం రావు కుటుంబం

అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న భూమిలోనే మడావి భీంరావు ఎనిమిది ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన తండ్రుల తరం నుంచే ఇక్కడ సాగు చేసుకుంటున్నారు. అటవీ హక్కు పత్రం ఉంది. అయితే తనను బలవంతంగా అక్కడి నుంచి ఖాళీ చేయించి క్వారీ చేపట్టారు. తన భూమి పోతోందని అధికారుల చుట్టూ తిరిగి, పరిహారం అడిగినా పట్టించుకునే వారే లేరు. క్వారీ అనుమతి కోసం సవితి గ్రామ పంచాయతీ తీర్మానం, గుట్టపై నుంచి రోడ్డు వేయిస్తామని ఒప్పందం రాయించుకుని కంకర తీసుకెళ్తున్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న సమీప పత్తి చేన్లు దుమ్ము ధూళితోపాటు బండరాళ్లు పడుతున్నా పట్టించుకునే వారే లేరు. ఇదేంటని అడిగితే తమపైనే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. సర్కారు భూమిగా పేర్కొంటూ, చుట్టుపక్కల ఎటువంటి హానీ జరగడం లేదని పంట, నివాసాలు ఇబ్బందులు లేవు అన్నట్లుగా పేర్కొంటూ ఉత్తర్వులు ఇచ్చారు.

కేసులు పెడతామని బెదిరిస్తున్నారు



చేనులో బండరాళ్లు పడుతున్నాయని అడిగితే కేసులు పెడతామ ని బెదిరిస్తున్నారు. పత్తి తీసేందుకు ఇబ్బంది అవుతోంది. పత్తిపై దుమ్ము ధూళి పడుతోంది. మార్కెట్‌లో ధర పెడతలేరు. – ఆత్రం సోము, మారు బాయి, క్వారీ సమీప రైతులు

నో ఆబ్జక్షన్ వచ్చాకే అనుమతి ఇచ్చాం

రెవెన్యూ శాఖ నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికేట్ ఇచ్చాకే గనుల శాఖ నుంచి అనుమతి ఇచ్చాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రాష్ట్ర స్థాయి నుంచి అనుమతి వస్తుంది. సీనరేజీ చార్జీలు చెల్లించాకే కంకర తరలిస్తున్నారు. పంట చేన్ల నష్టం క్వారీ యాజమానులు, రైతులు మాట్లాడుకోవాలి – నాగరాజు, ఏడీ, గనుల శాఖ, కుమురంభీం జిల్లా

18 నుంచి 'కంటి వెలుగు'



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి ప్రారంభించనున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సోమేశ్‌కుమార్, మంత్రులు దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డితో కలిసి కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకునేలా అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రచారం చేపట్టాలన్నారు. 12లోగా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. 18న ప్రతి నియోజకవర్గంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించే గ్రామాలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎంపిక చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1500 బృందాలను ఏర్పాటు చేశామని, పని దినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు.

కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణ కోసం జిల్లాలో 20 బృందాలు, 4 అదనపు బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, మున్సిపల్ ప్రాంతాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రోగుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో రత్నమాల, డీపీవో రమేశ్, డీఆర్‌డీవో సురేందర్, డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ అలీ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు.

11వ వేజ్‌బోర్డు ఖరారు

- ఎనిమిదో సమావేశంలో కుదిరిన ఒప్పందం
- 19 శాతం వేతన పెరుగుదలకు యాజమాన్యాల అంగీకారం
- కోల్‌కత్తాలో జేబీసీసీఐ సమావేశం

రెబ్బెన(ఆసిఫాబాద్): బొగ్గుగని కార్మికులు దాదాపు ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్న 11వ వేతన ఒప్పందం ఎట్టకేలకు ఖరారైంది. జాతీయ కార్మిక సంఘాలతో మంగళవారం కోల్‌కత్తాలో కోల్ ఇండియా జరిపిన చర్చల్లో 19 శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్స్ అందించేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి. 10వ వేజ్‌బోర్డులో జాతీయ కార్మిక సంఘాలు సాధించిన వేతన పెరుగుదల శాతంతో పోల్చితే ప్రస్తుతం సాధించిన వేతన పెరుగుదల ఒక శాతం తగ్గినా.. పెరిగిన బేసిక్‌తో చూస్తే ఈ వేతన పెరుగుదల మెరుగైనదే అని కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు. యాజమాన్యం అంగీకరించిన 19శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్ ద్వారా ఒకటో కేటగిరి కార్మికుడికి దాదాపు రూ.6,900 వరకు వేతనం పెరగనుంది. ఇక మిగిలిన అలవెన్సులు, లీవులు, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై త్వరలోనే చర్చించే అవకాశం ఉంది.

ఏడాదిన్నర తర్వాత కుదిరిన ఒప్పందం..

10వ వేజ్‌బోర్డు 2012 జూన్ 30తో ముగియగా, 11వ వేజ్‌బోర్డు కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారు. వేతన ఒప్పందంపై ఇప్పటివరకు ఏడుసార్లు జాతీయ కార్మిక సంఘాలతో యాజమాన్యాలు చర్చించారు. చివరికి మంగళవారం కోల్‌కత్తాలో జరిగిన 8వ సమావేశంలో యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాలు 19శాతం వేతనాల పెరుగుదలకు అంగీకరించడంతో 11వ వేజ్‌బోర్డుకు లైన్ క్లియర్ అయినట్లైంది. జాతీయ కార్మిక సంఘాలు మొదట 50 శాతం వేతనాల పెంపునకు డిమాండ్ చేయగా యాజమాన్యం కేవలం 3 శాతానికి పరిమితమైంది. ఆపై కార్మిక సంఘాలు 47 శాతానికి దిగి రాగా యాజమాన్యం 10 శాతం మాత్రమే పెంచేందుకు అంగీకరించింది. 8వ సమావేశంలో యాజమాన్యంతో పాటు జాతీయ కార్మిక సంఘాలు 19 శాతం వేతన పెరుగుదలకు అంగీకరించడంతో చర్చలు ముగిశాయి. 19 శాతం వేతనాల పెరుగుదలకు చర్చలకు హాజరైన ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్‌లు అంగీకరించగా హెచ్ఎంఎస్ మాత్రం వ్యతిరేకించినట్లు సమాచారం.

బేసిక్ వేతనం (రూ.లలో)లో మార్పులు

గ్రేడ్	10వ వేజ్‌బోర్డు	11వ వేజ్‌బోర్డు
ఏ1	47,802.52	71,031.20
ఏ	37,063.41	55,073.64
బీ	34,391.65	51,103.58
సీ	31,852.30	47,330.29
డీ	29,460.30	43,775.94
ఈ	28,242.84	41,966.89
ఎఫ్	27,930.19	41,502.31
జీ	27,541.77	40,925.15
హెచ్	26,959.07	40,059.29
1వ కేటగిరి	1,011.27	1,502.68
2వ కేటగిరి	1,034.04	1,536.52
3వ కేటగిరి	1,065.55	1,583.33
4వ కేటగిరి	1,087.17	1,615.46
5వ కేటగిరి	1,132.39	1,682.56
6వ కేటగిరి	1,181.83	1,756.12

మెరుగైన ఒప్పందం

ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో కేవలం 15 శాతం వేతన పెరుగుదలకు ఒప్పందం కుదరగా, బొగ్గు గని కార్మికులకు మాత్రం 19 శాతం పెరుగుదలను సాధించాం. 15 శాతం పెరిగిన సంస్థల్లో వేజ్‌బోర్డు కాలపరిమితి 10ఏళ్లకు ఉంటే, 19 శాతం వేతన పెరుగుదల ఉన్న బొగ్గు సంస్థల్లో కేవలం ఐదేళ్లకే వేజ్‌బోర్డు ఉండేలా సాధించుకున్నాం. – వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

పెరగనున్న వేతనాలు

11వ వేతన ఒప్పందంలో భాగంగా యాజమాన్యం అంగీకరించిన 19 శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్స్‌ను 2021 జులై 1 నుంచి అమలు చేయనున్నారు. ఆ సమయంలో ఉన్న బేసిక్‌పై 19 శాతం పెంచి కార్మికులకు వేతనాలు అందించనున్నారు. మిగిలిన గ్రేడ్‌ల కార్మికులకు బేసిక్ ఆధారంగా వేతనాల్లో పెరుగుదల ఉంటుంది. ఏ1 గ్రేడ్ కార్మికుడికి బేసిక్ 10వ వేజ్‌బోర్డులో రూ.40,802 ఉంటే ప్రస్తుత వేతన ఒప్పందంలో రూ.73,844కు చేరుతుంది.

కొనసాగిన బహుజన రాజ్యాధికార యాత్ర



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

దహెగాం(సిర్పూర్): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన రెండో విడత బహుజన రాజ్యాధికార యాత్ర మంగళవారం రెండో రోజు కొనసాగింది. దహెగాం మండలంలోని ఇట్యాల, కోత్మీర్, బీబ్రా, ఐనం, పెసరికుంట, కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అందవెల్లి వాగుపై కూలిన వంతెనతోపాటు పెద్దవాగు పరీవాహక ప్రాంతాల్లో పంటలు కొట్టుకుపోయి బీళ్లుగా మారిన భూములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందవెల్లి పెద్దవాగుపై వంతెన కూలి నెలలు గడుస్తున్నా ఇంకా పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. పెంచికల్‌పేట్ పెద్దవాగుపై వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో దహెగాం, భీమిని మండలాల ప్రజలు కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే 80 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన దుస్థి తి ఏర్పడిందన్నారు. ఎమెల్యే అనుచరులు ఫారెస్టు భూములు కబ్జా చేస్తే వారికి పట్టాలు వచ్చాయని, 60 ఏళ్లుగా సాగు చేస్తున్న వారికి మాత్రం పట్టాలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

పెద్దవాగు వంతెన పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి పెద్దవాగు వంతెనను మంగళవారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. వంతెన కూలిపోవడానికి కారకులైన కాంట్రాక్టర్, ఇంజనీర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జీలు హర్షద్ హుస్సేన్, కనక ప్రభాకర్, మండల అధ్యక్షుడు దుర్గం దాసు, నాయకులు గౌతం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి



వైద్యురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యేలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తొలి సిజేరియన్
- వైద్యులకు కలెక్టర్, ఎమ్మెల్యే అభినందన

ఆసిఫాబాద్: ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం పర్శనంబాలకు చెందిన గర్భిణికి ఆస్పత్రి చరిత్రలో తొలిసారి సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు. మంగళవారం ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆస్పత్రిని సందర్శించారు. సిజేరియన్ నిర్వహించిన కాగజ్‌నగర్ ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు వీణ, మత్తు డాక్టర్ హర్షవర్దన్, నర్సులు, వైద్యసిబ్బందిని శాలువలతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ ప్రభుత్వాస్పత్రిలో తొలిసారి నిర్వహించిన సిజేరియన్ కాన్పులో తల్లీబిడ్డలు క్షేమంగా ఉండడంలో వైద్యుల కృషి అభినందనీయమన్నారు. ఇక నుంచి గర్భిణులు దూరప్రాంతాలకు వెళ్లకుండా జిల్లాలోనే వైద్య సేవలు అందిస్తామని అన్నారు. డీసీహెచ్ డాక్టర్ స్వామి, డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, అడ పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల సావిత్రీబాయిలు!



తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి జయంతిని కెరమెరి మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సావిత్రీబాయి వేషధారణలో ఆకట్టుకున్నారు. నేత చీర కట్టుకుని, చేతిలో పుస్తకాలతో మురిసిపోయారు. సావిత్రీబాయి బాలికలు, మహిళల కోసం చేసిన సేవలను ఎస్‌వో మీనాకుమారి విద్యార్థినులకు వివరించారు. - కెరమెరి

క్లుప్తంగా

కాలువలో పడి వృద్ధుడి మృతి


పుల్లయ్య (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి వృద్ధుడు దుర్మరణం చెందాడు. సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈదులవాడ గ్రామానికి చెందిన తన్నీరు పుల్లయ్య (81) రెండేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. సోమవారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో బహిర్భూమి కోసం పక్కనే ఉన్న వట్టివాగు కాలువ వైపు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడి మృతి చెందాడు. పుల్లయ్య ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం కుటుంబీకులు వెతికారు. మంగళవారం ఉదయం కాలువవైపు వెళ్లగా అందులో పుల్లయ్య మృతదేహం కనిపించింది. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నలుగురి బైండోవర్


తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎస్సై

తిర్యాణి: వన్యప్రాణుల వేట కోసం గతంలో విద్యుత్ తీగలు అమర్చిన నలుగురిని పోలీసులు మంగళవారం తహసీల్దార్ అనంతరాజు ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్ మాట్లాడారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని చెప్పారు. ఎక్కడైనా వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చినట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కలప పట్టివేత


పట్టుకున్న కలపతో ఎఫ్ఆర్వో, అటవీ అధికారులు

కెరమెరి: మండలంలోని హట్టి గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న మూడు కలప దుంగలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఎఫ్ఆర్వో మజారుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు మంగళవారం హట్టి వద్ద అటవీ అధికారులు గస్తీ నిర్వహించారు. జోడేఘాట్ వైపు నుంచి వస్తున్న మ్యాక్స్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో మూడు కలపదుంగలుండగా స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.20వేలు ఉంటుంది. ఈమేరకు డ్రైవర్ కం ఓనర్ షేక్ కరీంపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. కార్యక్రమంలో డీఆర్వోలు భీంరావు, జ్ఞానేశ్వర్, ఎఫ్‌బీవోలు రామయ్య, ప్రభాకర్, అరుణ్ ఉన్నారు.

క్యాతనపల్లిని సందర్శించిన అడిషనల్ కలెక్టర్


చెత్త సేకరణను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీని మంగళవారం అడిషనల్ కలెక్టర్ రాహుల్ సందర్శించారు. ఒకటో వార్డు తారకరామకాలనీలో తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసే ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ వాహనానికే చెత్త ఇవ్వాలని సూచించారు. అనంతరం రాజీవ్‌చౌక్‌లో కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. చెత్త బయటవేస్తే జరిమానా విధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ టీచర్ లిటిల్ లీడర్ షురూ..

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు, కనీస సామర్థ్యాలను పెంచేందుకు జిల్లా విద్యాశాఖ దృష్టి సారించింది. అభ్యసనాభివృద్ధి కార్యక్రమం 'లిటిల్ టీచర్–లిటిల్ లీడర్'ను ప్రారంభించింది. ఇదివరకు కలెక్టర్ భారతీహోళ్కేరి ప్రత్యేక చొరవతో వందేమాతరం ఫౌండేషన్ స్ఫూర్తితో పదోతరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు కార్యక్రమం చేపట్టారు. సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగు, సామర్థ్యాల పెంపుదలకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. తొలిమెట్టు కార్యక్రమానికి కొనసాగింపుగా ఉన్నత పాఠశాలల్లోనూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రతీ పాఠశాల నుంచి తరగతుల వారీగా గ్రూపులు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 130 ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్‌స్కూళ్లలో 22,809 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆరునుంచి పదోతరగతి వరకు ప్రారంభమైన 'లిటిల్ టీచర్–లిటిల్ లీడర్' కార్యక్రమంపై 'సాక్షి' కథనం..

- విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై దృష్టి
- ఉత్తమ ఫలితాల సాధనకు కార్యాచరణ
- ఆరు నుంచి టెన్త్‌క్లాస్ వరకు అమలు


కోటపల్లి మండలం దేవులవాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

తరగతులవారీగా విద్యార్థుల సంఖ్య	
ఆరో తరగతి	3,894
ఏడో తరగతి	4,558
ఎనిమిదో తరగతి	4,584
తొమ్మిదో తరగతి	4,754
పదో తరగతి	5,019
మొత్తం	22,809

ప్రమాణాల పెంపునకు కృషి

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలల్లోగల విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాల పెరుగుదల, నాణ్యమైన, మెరుగైన ఫలితాల సాధనకు 'లిటిల్ టీచర్–లిటిల్ లీడర్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు ప్రతీనెల సమీక్షా సమావేశం నిర్వహించనున్నాం. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు సబ్జెక్ట్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ బాధ్యతలను విధిగా నిర్వహిస్తూ విజయవంతం చేయాలి.

– వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

'పది' విద్యార్థుల ప్రణాళిక ఇలా..

పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నాయంటే విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లోనూ ఆందోళన మొదలవుతుంది. ఉత్తీర్ణత సాధిస్తామో.. లేదో.. అనే భావన ఉంటుంది. పరీక్షల్లో ప్రతిభ చూపి మంచి మార్కులు సాధించిన విద్యార్థుల ఆనందం మాటల్లో చెప్పరానిది. కానీ.. అనివార్య కారణాలతో పాఠశాల తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పిన విషయం అర్థం కాకపోవడం, ఉపాధ్యాయుల కొరత కారణంగా ఫెయిలైన విద్యార్థులకు ఓ ఏడాది వృథా అయినట్లే. ఏటా హడావుడిగా పరీక్షల ముందు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నా ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పదోతరగతిలో 100శాతం ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. విద్యార్థులకు బాసటగా నిలవడానికి జిల్లా పాలనాధికారి భారతీహోళ్కికేరి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. గతంలో సత్ఫలితాలు రావడంతో మరోసారి జిల్లాలో అమలుకు శ్రీకారం చుట్టారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయసారిణిని యథావిధిగా పాటిస్తూ సాయంత్రం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నిత్యం ప్రత్యేక తరగతుల్లో నిర్దేశించిన సబ్జెక్ట్‌పై బృంద చర్చ, అభ్యసనం, ప్రశ్నాపత్రం తయారు చేసి షెడ్యూల్ ప్రకారం అదే సబ్జెక్ట్‌పై సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో పరీక్ష నిర్వహణ, మూల్యాంకనం, మార్కుల నమోదు, పునఃశ్చరణ చేయాల్సి ఉంటుంది.

6నుంచి 9వరకు ప్రణాళిక ఇలా..

ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు నిత్యం ప్రధానోపాధ్యాయులు ఆరోజుకు నిర్దేశించిన సబ్జెక్ట్ ఆరోజు గల సబ్జెక్ట్ పీరియడ్‌లోనే 'లిటిల్ టీచర్–లిటిల్ లీడర్'ను భాగస్వాములను చేస్తూ బృంద చర్చ, అభ్యసనం, ప్రశ్నాపత్రం తయారు చేసుకోవాలి. నిత్యం సాయంత్రం 4నుంచి 4.45గంటల వరకు స్లిప్ టెస్ట్, మూల్యాంకనం, మార్కుల నమోదు, పునఃశ్చరణ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతీ గ్రూప్‌లో ఐదు నుంచి ఆరుగురు విద్యార్థులు ఉండేలా చూడాలి. గ్రూపులో సభ్యుల నుంచి ఒకరు లిటిల్ టీచర్‌గా, మరొకరిని లిటిల్ లీడర్‌గా నియమించాలి.

సబ్జెక్ట్ టీచర్లు, హెచ్ఎంల విధులు..

నిత్యం జరిగే ప్రత్యేక తరగతుల్లో బృందాలు చదివేలా పర్యవేక్షణ చేయడం, బృందానికి సాధ్యం కాని విషయాలను నివృత్తి చేయడం, విద్యార్థులు తయారు చేసిన ప్రశ్నాపత్రం విద్యా ప్రమాణాల ఆధారంగా ఉండేలా సలహా ఇవ్వడం, సరిచూడడం, పరీక్ష రాసేలా ప్రోత్సహించడం, రోజువారీ ప్రశ్నాపత్రాలు భద్రపర్చడం, మార్కుల నమోదు, బడికి సక్రమంగా హాజరుకాని విద్యార్థులను పాఠశాలకు రప్పించడంలో బృందానికి సహాయపడాలి. ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు సన్నాహక సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. నిరంతరం బృందాలను పరిశీలిస్తూ తగిన సలహాలు ఇవ్వాలి. విద్యార్థులు నమోదు చేస్తున్న మార్కుల షీట్‌ను పరిశీలించాలి. విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుని తగిన సూచనలు ఇవ్వాలి. పర్యవేక్షణాధికారులకు వివరాలు తెలియజేస్తూ సహకరించాలి. నెలవారీగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పీటీఎం సమావేశాల్లో చర్చించాలి. నెలవారీగా నివేదిక జిల్లా విద్యాశాఖకు అందించాలి. 'లిటిల్ టీచర్–లిటిల్ లీడర్ విధులు పూర్తి బాధ్యతగా నిర్వహిస్తాను.. బడికి క్రమం తప్పకుండా హాజరవుతాను.. తోటి వారు హాజరయ్యేలా చొరవ చూపుతాను.. నా తరగతిలో శతశాతం ఫలితాల సాధనకు కృషి చేస్తా..' అంటూ ప్రతిజ్ఞ చేయాల్సి ఉంటుంది.

నిర్వహించాల్సిన విధులు..

లిటిల్ టీచర్ తన బృందానికి సబ్జెక్ట్ ఉపాధ్యాయుడిగా, సమన్వయకర్తగా వ్యవహరించనున్నాడు. బృందంలోని విద్యార్థులను చదవించడం, చర్చించడం, సందేహాలను నివృత్తి చేయడం, ప్రశ్నాపత్రాలు తయారు చేయించడం, బృందానికి సాధ్యం కానీ విషయాలను ఉపాధ్యాయుడితో చర్చించి అందరికీ తెలియజేయాల్సి ఉంటుంది. లిటిల్ లీడర్ తరగతిలో బృందాలకు సంధానకర్త. విద్యార్థులు నిత్యం హాజరయ్యేలా చూడడం, ఉపాధ్యాయులు, లిటిల్ టీచర్లకు అనుసంధానంగా పనిచేయడం, అభ్యసనంలో వెనకబడిన వారి గుర్తించి ప్రత్యేక చొరవ చూపడం, బృందంతో జవాబు పత్రాల మూల్యాంకనం చేయడం, మార్కులు సంబంధిత షీట్లలో నమోదు చేసి ఉపాధ్యాయులకు నివేదించడం చేయాలి.

నల్లబ్యాడ్జీలతో కాంట్రాక్ట్ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: 11వ వేతన ఒప్పంద చర్చల్లో ఫస్ట్ కేటగిరి వేతనం కల్పించేలా ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కాంట్రాక్ట్ కార్మికులు డిపార్టుమెంట్ల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ బ్రహ్మానందం మాట్లాడుతూ ఈ వేతన ఒప్పంద చర్చల్లో కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాపు, రాజన్న, శంకర్, అప్పల రాజు, బక్కయ్య, గురువులు, కిరణ్, శ్రీను పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయం 2023–24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవాకం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల విద్యార్థులు అర్హులని తెలిపారు. ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరో తరగతిలో 80 సీట్లు ఉండగా ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన విద్యాలయ సమితి ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

7న ముగ్గుల పోటీ

బెల్లంపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని ఈనెల 7న బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఏఎంసీ మైదానంలో ఉదయం 9.30గంటలకు ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు అందిస్తామని పేర్కొన్నారు. పాల్గొన్న ప్రతీ మహిళకు కన్సోలేషన్ బహుమతి అందిస్తామని తెలిపారు. విజేతలకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బహుమతులు ప్రదానం చేస్తారని, పూర్తి వివరాలకు 9381567440, 8978633321 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్కే 1ఏ ఏరియాలోనే కార్మికుల సర్దుబాటు


రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం, ఉద్యోగులు

రామకృష్ణాపూర్: ఆర్‌1ఏ గని జీవితకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికులందరినీ ఏరియాలోని ఇతర గనుల్లో సర్దుబాటు చేస్తామని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మందమర్రి జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గనికి విచ్చేసిన జీఎం కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఉత్పత్తి, ఉత్పాదకతలతోపాటు రక్షణ విషయంలో ఇతర గనులకు ఆదర్శంగా నిలిచిన ఆర్‌కే1ఏ గని స్టార్ రేటింగ్ గనిగా పేరుగాంచడం అభినందనీయమని అన్నారు. రక్షణ పరంగా మరింత జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలు లేని గనిగా పేరు గడించాలని అన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ రాందాస్, ఏఎస్ఓ ఓదెలు, మేనేజర్ శ్రీధర్‌రావు, ఎస్ఓ జయంత్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిపైనే దృష్టి సారించాలి

బెల్లంపల్లి: కార్మికులు, ఉద్యోగులు బొగ్గు ఉత్పత్తిపైనే దృష్టి సారించాలని మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం శాంతిఖని గనిపై జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి ఓదెలు, శాంతిఖని ప్రాజెక్టు అధికారి విజయ్‌ప్రసాద్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, డెప్యూటీ మేనేజర్ ముస్తాఫా, గని సంక్షేమ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

బెల్లంపల్లి: జేబీసీసీఐ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి సివిక్ కార్యాలయం ఆవరణలో ఇఫ్టూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై వరుసగా రెండోరోజూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇఫ్టూ శ్రేణులు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు ఫస్ట్ కేటగిరి వేతనం చెల్లించేలా పట్టుదలతో వ్యవహరించాలన్నారు. క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం చెల్లించడానికి చర్చల్లో ప్రధానంగా చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు శ్యామ్, రవి, అబ్దుల్లా, రాములు, లచ్చన్న, సంపత్, వినోద్, రమేశ్, పవన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: ఆల్ ఇండియా రెజ్లింగ్ పోటీలకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీ సుమతి తెలిపారు. ఈ నెల 6నుంచి 9వ వరకు పుణెలో జరిగే పోటీలకు బీజెడ్సీ సెకండియర్ విద్యార్థిని కే అంజలి, డాటా సైన్స్ సెకండియర్ విద్యార్థిని డీ వందన, ఎంజెడ్సీ సెకండియర్ విద్యార్థిని జీ ప్రవళిక ఎంపిక కాగా, వారిని ఆర్సీవో కే స్వరూపారాణి, డీసీవో ఆర్.బాలభాస్కర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సునీత, పీడీ పద్మ అభినందించారు.


ఎంపికైన గురుకుల విద్యార్థినులు

'ఈ మూడు నెలలు ఉత్పత్తికి కీలకం'

శ్రీరాంపూర్: ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ఈ మూడు నెలలు ఎంతో కీలకమని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఏరియా స్టోర్స్, వర్క్‌షాప్, ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనులపై ఉద్యోగులతో మాట్లాడారు. మార్చి 31 నాటికి కంపెనీ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గనులవారీగా నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను నూరు శాతం సాధించడమే కాకుండా ఏరియా ఉత్పత్తి లోటును పూడ్చడానికి అదనపు ఉత్పత్తి తీయాలన్నారు. ఏకాగ్రతతో పని చేసుకుంటూ ప్రమాదాలను నివారించాలన్నారు. సింగరేణిని జీరో ప్రమాదాల సంస్థగా మార్చాలని, ఇందుకు పీపీఈ కిట్లు ధరించి గనుల్లో పని చేయాలని సూచించారు. ఆయా గ్రూపుల ఏజెంట్లు సత్యనారాయణ, డీజీఎం (వర్క్‌షాప్) చంద్రశేఖర్‌రెడ్డి, స్టోర్స్ డీజీఎం సోమశేఖర్, న్యూటెక్ మేనేజర్ స్వామి రాజు, ఆర్కే 7 గని మేనేజర్ సాయిప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, గనుల పిట్ సెక్రటరీలు మెండె వెంకటి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోణంపేట శివారులో పులి!

నెన్నెల: మండలంలోని కోణంపేట, శ్రావణ్‌పల్లి శివారు ప్రాణహిత కాలువ అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి పాదముద్రలను గుర్తించారు. కుశ్నపల్లి అటవీ ప్రాంతం మీదుగా కోణంపేట శివారులో సంచరిస్తూ నీల్వాయి, ఒడ్డుగూడ ప్రాంతానికి పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా గుర్తించారు. అటవీ శివారు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అటు వైపు వెళ్లేందుకు గ్రామస్తులు, కూలీలు జంకుతున్నారు. కాగా, రెండు రోజుల క్రితం ఆ ప్రాంతంలో పులి దుప్పిని వేటాడిందని కోణంపేట గ్రామస్తులు పేర్కొంటున్నారు. పొలాలు, పత్తి చేలకు వెళ్లే కూలీలు అప్రమత్తంగా ఉండాలని, అటు వైపు ఎవరూ వెళ్లవద్దని అధికారులు దండోరా వేయించారు. బుధవారం అటవీ అధికారులు కోణంపేటలో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

వీణకు రాష్ట్ర స్థాయి అవార్డు


అవార్డు అందుకుంటున్న వీణ

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని సావర్‌ఖేడ పాఠశాలలో పదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా బోధిస్తున్న కడేర్ల వీణ మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా సావిత్రీబాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, ఉత్సవ కమిటీ చైర్మన్ మణిమంజరీ చేతుల మీదుగా ఈ అవార్డును వీణ స్వీకరించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందిస్తూ శాలువాతో వీణను సత్కరించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

అడవి తల్లి ఒడిలో అమ్మ


పిల్లకు పాలు ఇస్తున్న చుక్కల దుప్పి

జన్నారం: అడవి తల్లి ఒడిలో అనేక రకాల వన్యప్రాణులు నివసిస్తాయి. అటవీ అధికారులు కొంత కాలంగా మంచి సౌకర్యాలు కల్పించడంతో వాటి సంతతి పెరుగుతోంది. చుక్కల దుప్పులు, నీల్‌గాయిలు, సాంబర్లు, అడవి దున్నలు వాటి సంతతిని పెంచుతున్నాయి. ఈ చిత్రంలోని చుక్కల దుప్పి తన పిల్లకు పాలిస్తూ కెమెరాకు చిక్కింది.

చోరీకి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బంగారం, మొబైల్స్‌తో ఎస్సై

జన్నారం: ఇటీవల మండలంలో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం పంచాయతీ పరిధి రాజీవ్‌నగర్‌కు చెందిన షేక్ మహ్మద్ ప్రైవేట్ వాహనాలపై డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటుపడి త్వరగా డబ్బు సంపాదించాలని చోరీలకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో గత నెల 14న మధ్యాహ్నం పొనకల్‌లోని శ్రీలంక కాలనీలోగల రాఘవేంద్ర కిరాణాషాపు వెనుకాల ఉన్న ఇంటికి తాళం వేసి ఉండడం గమనించాడు. గోడ దూకి ఇంటి తలుపును ఇనుప రాడ్‌తో పగులగొట్టి లోనికి చొరబడ్డాడు. రూ.లక్ష నగదు, బంగారు నల్లపూసల గొలుసు, ఒక టచ్ ఫోన్ ఎత్తుకెళ్లాడు. ఇందులోంచి రూ.13 వేలతో మొబైల్, బ్లూటూత్ కొనుక్కుని, మిగతా డబ్బులను ఇంటి అవసరాలు, జల్సాలకు ఉపయోగించాడు. డబ్బులు ఖర్చు కావడంతో నల్లపూసల గొలుసును అమ్మడానికి మంగళవారం కవ్వాల్ ఆటో పాయింట్ సమీపంలోని దుకాణాలకు వచ్చాడు. సమాచారం అందుకున్న ఎస్సై అక్కడకు చేరుకుని నిందితుడి నుంచి నాలుగు తులాల నల్లపూసల గొలుసు, రెండు సెల్‌ఫోన్లు, బ్లూటూత్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

10నుంచి కడెం ఆయకట్టుకు నీటి విడుదల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: కడెం ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు ఈ నెల 10నుంచి యాసంగి పంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో ఎమ్మెల్యేలు సమావేశం అయ్యారు. పంటలకు నీటిని విడుదల చేయాలని రైతుల సమక్షంలో తీర్మానించారు. వారబందీ పద్ధతిన ఐదు తడులు సాగు నీటిని విడుదల చేస్తామని, ఆరుతడి పంటలే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిషన్, జెడ్పీటీసీ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రఫీక్ అహ్మద్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, డీఈ భోజదాసు, నాయకులు రమేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త గ్రూపుల ఏర్పాటుకు ఉత్తర్వులు

పాతమంచిర్యాల: గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి బీ శేషాద్రి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్లు నిండిన యువతులు, ఇప్పటికీ గ్రూప్‌లలో చేరనివారు సంఘాల్లో చేరవచ్చని పేర్కొన్నారు. ఇందుకు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఓటరు జాబితా ఆధారంగా 18 ఏళ్లు నిండిన అర్హులను గుర్తించివారికి సంఘాల్లో సభ్యత్వం కల్పించనున్నట్లు ఆయన వివరించారు.

అడవిలో అరుదైన పక్షులు


ఇండియన్ డర్టర్ పక్షి


గే హీడెడ్ ఫిష్ ఈగల్

జన్నారం అటవీ డివిజన్ రకరకాల జంతువులకే కాకుండా అరుదైన పక్షులకు అవాసంగా మారింది. డివిజన్‌లోని మైసమ్మ కుంటలో పక్షుల కిలకిలలు నిత్యం వినిపిస్తుంటాయి. ఈ ప్రాంతంలో ఆసియా దేశాల్లో ఉండే అరుదైన ఇండియన్ డర్టర్ పక్షి, గ్రే హీడెడ్ ఈగల్ మంగళవారం కనిపించాయి. వీటిని డిప్యూటీ కన్జర్వేటర్, జన్నారం ఎఫ్‌డీవో మాధవరావు తన కెమెరాలో బంధించారు. –జన్నారం